క్లుప్తంగా

శరవేగంగా జాతీయ రహదారి పనులు



నాగరాజకుప్పం వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు

నగరి: చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారి పనులు నగరి మండలంలో శరవేగంగా జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లా, తమిళనాడు తిరువళ్లూరు జిల్లాల్లోనే రహదారి వెళ్తుంది. చిత్తూరు జిల్లాలో 75 కిలోమీటర్లు మేర ఈ రోడ్డు నిర్మించనుండగా, నగరి నియోజకవర్గంలోని నత్తం కండ్రిగ, నగరి, దామరపాకం, విజయపురం, నిండ్ర మండలాల్లో ప్రస్తుతం రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జాతీయ రహదారి నిర్మాణంలో ప్యాకేజీ–2లో భాగంగా కుమారరాజ పేట నుంచి నగరి మండలం వీర కావేరిరాజపురం వరకు 17.58 కిలోమీటర్లు రోడ్డును నిర్మిస్తున్నారు.

హడలెత్తించిన జీపు



ప్రమాదానికి కారణమైన జీపు



డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: ఓ జీపు జనాన్ని హడలెత్తించిన సంఘటన శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఓ యువకుడు మద్యం సేవించి వీఎంసీ కూడలి నుంచి జీపును నడుపుకుంటూ హల్‌చల్ చేశాడు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ ఆటోను ఢీకొన్నాడు. అక్కడి నుంచి తెట్టు కూడలి వద్ద ఓ పెళ్లి బృందం కారును ఢీకొన్నాడు. అయితే కారులో బెలూన్ తెరచుకోవడంతో చెంబేడుకు చెందిన పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తె ప్రమాదం నుంచి బైటపడ్డారు. అయితే ఈ ప్రమాదంలో పెళ్లికుమార్తె తల్లి, బాలుడు స్వల్పంగా గాయపడ్డారు. వారిని స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అలాగే పెళ్లి బృందం కారును ఢీకొన్న అనంతరం అక్కడే ఉన్న ఓ ఆటోను జీపు ఢీకొనడంతో అది బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్ గణేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న రెండవ పట్టణ ఎస్‌ఐ మహేష్‌బాబు ఘటనా స్థలానికిచేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. ప్రమాదానికి కారకుడైన జీపు డ్రైవర్ మణి(23)ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇతడు తిరుపతి రూరల్ మండలం మంగళం వాసి అని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

నేడు రామగిరిలో అష్టమి పూజలు

పిచ్చాటూరు: మండలంలో రామగిరిలోని శ్రీ సంతాన కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం అష్టమి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ లత తెలిపారు. పల్లవుల కాలం నాటి ఈ ఆలయంలో క్షేత్ర పాలకునిగా కొలువుదీరిన కాలభైరవ స్వామికి ఉదయం అభిషేక పూజలు అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని, భక్తులు నేతిదీపాలు వెలిగించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆమె చెప్పారు.

ఘనంగా గంగమ్మ జాతర



అలంకరణలో గంగమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోటలో మైక్రోవేవ్ స్టేషన్ కాలనీలోని గ్రామదేవత గంగమ్మకు శనివారం కాలనీవాసులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి, ఘనంగా జాతర నిర్వహించారు. గంగమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి, ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం అంబలి పోసి మొక్కులు చెల్లించారు. దేవాలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన నిందితుడితో ఎస్‌ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో కర్ణాటక మద్యాన్ని సీజ్ చేసి, విక్రేతను అరెస్టు చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) అధికారుకు అందిన సమాచారం మేరకు, మద్యం అక్రమ విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సంతపేటకు చెందిన కిషోర్‌కుమార్ (40) వద్ద 22 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడింది. అధికారులు విక్రేతను అరెస్ట్ చూపించి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సీఐ జోగేంద్ర, ఎస్‌ఐ బాబు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

పల్లె వాకిట ప్రభుత్వ సేవలు

- గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారం
- గతంలో మండల కేంద్రాలకు పరుగులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు





విజయపురం సచివాలయంలో సేవలు పొందుతున్న గ్రామస్తులు, పన్నూరులోని సచివాలయం

మహాత్ముడు గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపన కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సాధ్యమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామాల్లో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు అయింది. గతంలో ఎలాంటి పని కావాలన్నా కిలోమీటర్ల మేర మండల, జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు పెట్టే ప్రజలు ఇప్పుడు తమ సొంత ఊళ్లోనే, వారి ఇళ్ల వద్దే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. ఇన్నేళ్లకు ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు అందుతుండడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.

విజయపురం (నగరి): మండల, జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనుల కోసం చుట్టూ చెప్పులరిగేలా తిరిగే పరిస్థితులు ఇప్పుడు లేవు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకా గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చింది. దానికితోడు వ్యవసాయ రంగ సేవలను కూడా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తోంది. అన్నిసేవలు ఒకేచోట అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో గ్రామస్థాయిలో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్ని సేవలూ గ్రామాల్లోనే..

విజయపురం మండలంలో 12 సచివాలయాలు ఉండగా 116 మంది సచివాలయ ఉద్యోగులు, 225 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. పల్లెల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించడంతో పాటు వారి ముగింటకే వెళ్లి పథకాలు అందించేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది ఈ ప్రభుత్వం. తద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలనను తెచ్చి సేవలను విస్తృతం చేసింది. గత ప్రభుత్వంలో ఏ సర్టిఫికెట్ కావాలన్న మండల కేంద్రాలకు పరుగు తీయాల్సిన పరిస్థితులు ఉండేవి. దీంతో సమయంతో పాటు ఖర్చు భారంగా మారింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సీఎం జగన్‌మోహన్ రెడ్డి సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. అంతేకాకుండా మండల కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బంది పడే ప్రజలకు గ్రామస్థాయిలోనే సమస్యలను పరిష్కరిస్తున్నారు.

మండలంలో 12 సచివాలయాలు ..

విజయపురం మండలంలో విజయపురం, ఇల్లత్తూరు, కోసలనగరం, శ్రీహరిపురం, సూరికాపురం, జగన్నాథపురం, పన్నూరు, కలియంబాకం, బూచివానత్తం, ఆలపాకం, కాళికాపురం, కేవీపురం మొత్తం 12 సచివాలయాలు ఉన్నాయి. అందులో ఒక్కో సచివాలయంలో 9 నుంచి 11 మంది వరకు వివిధ విభాగాల ఉద్యోగులు పని చేస్తున్నారు. రెవెన్యూ, ఎంపీడీఓ, వ్యవసాయశాఖలకు సంబంధించిన పనులతో పాటు విద్యార్థులకు సచివాలయాల ద్వారా విశేష సేవలందిస్తున్నారు. ప్రధానంగా ఇంటి పట్టా, రేషన్‌కార్డు, మ్యుటేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పోలీసు వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, వన్–బీ, అడంగల్, పింఛన్ దరఖాస్తు, సదరన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు ఇలా అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు.

అప్పట్లో జన్మభూమి కమిటీదే పెత్తనం



టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవాళ్లం. అది కూడా రెండేళ్లకోసారి కార్డులు ఇచ్చేవారు. ఈ కార్డులకు కూడా పల్స్ సర్వేకు ముడిపెట్టి అప్పట్లో కోతలు పెట్టేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఒక్క రోజులోనే వందలాది మందికి కార్డులు ఇచ్చారు. అందులో నాకు కూడా ఒకే రోజులో రేషన్‌కార్డు ఇచ్చారు.

–రాజాదాస్, విజయపురం

ఆధార్ ఇప్పుడు మా ఊళ్లోనే



ఆధార్‌లో దొర్లిన తప్పులను సరిదిద్దుకునేందుకు, కొత్తగా తీసుకోవడానికి నగరికి వెళ్లాల్సి వచ్చేది. అక్కడ టోకెన్‌తో 10 రోజుల తర్వాత ఆధార్ చేయించుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే సచివాలయాల్లోనే ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసింది. ఇక్కడ ఆధార్ సెంటర్ పెట్టడంతో మాకు నగరికి వెళ్లే బాధ తప్పింది. సచివాలయం వచ్చాక ఎంతో మేలు.

–జిల్‌దాస్, బూచివానత్తం

ఇల్లు ఇచ్చారు..



ఒకప్పుడు ఇంటి కోసం చాలా సార్లు మండల కార్యాలయం చుట్టూ తిరిగాను. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నానో లెక్క లేదు. అయితే ఎలాంటి ప్రయోజనం లేదు. మా గ్రామంలో సచివాలయం ఏర్పాటు అయ్యాక ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నా. నెల రోజుల్లోనే ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు ఇల్లు కూడా కట్టుకుంటున్నా. సీఎం జగనన్నకు థ్యాంక్స్.

–జయరాం, విజయపురం దళితవాడ

సంతోషంగా ఉంది..



గ్రామాల్లో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. పేదలకు సేవలు అందించడంలో సచివాలయాలు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. ప్రజల ఇళ్ల వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కింది. నాకు పట్టా పాసుపుస్తకంలో అండగల్ సరి చేసుకున్నాను.

–రవినాయుడు, గంగమాంబపురం

కార్గో జిల్లా అధికారిగా సురేంద్రబాబు



తిరుపతి అర్బన్: ఆర్టీసీ తిరుపతి జిల్లా కార్గో అధికారిగా సురేంద్రబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రకాశం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జీఎల్‌వీవీ సుబ్బారావు పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆర్టీసీ కార్గో అధికారులు శనివారం జీఎల్‌వీవీ సుబ్బారావుకు వీడ్కోలు పలుకుతూ సురేంద్రబాబుకు స్వాగతం పలికారు.

స్కిల్‌హబ్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కార్వేటినగరం: స్థానిక ఐటీఐ కళాశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌ను నిరుద్యోగ, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాల ని డీఎస్‌డీఓ గుణశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఐటీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ మోహన్‌మురళి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం స్కిల్‌హబ్ సంస్థ ద్వారా రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణతో పాటు స్కిల్ ఇండియా సర్టిఫికేషన్, అలాగే కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్‌మీడియట్, ఇతర విద్యార్హత కలిగిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉన్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ కోసం 8142509017లో సంప్ర దించాలని సూచించారు. ఆయన వెంట ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నట్టల నివారణపై అవగాహన



పశువులకు గాలికుంటువ్యాధి టీకా వేస్తున్న పశువైద్యాధికారి యశశ్వి

పాలసముద్రం: మండల పరిధిలో పాడిపశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, మేకలు, గొర్రెలకు సకాలంలో నట్టల నివారణ మందులు మేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయని పశువైద్యాధికారి యశశ్వి తెలిపారు. శనివారం ఆమె పాలసముద్రం రైతు భరోసా కేంద్రం ఆవరణలో పాడిపశువులకు, మేకలు, గొర్రెలకు ఉచిత వైద్యసేవలు అందించే కార్యక్రమం చేపట్టారు. పాడి రైతులతో ఆమె మాట్లాడుతూ పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులను గుర్తించి నట్టల నివారణ టీకాలను ప్రభుత్వమే పంపిణీ చేస్తోందని తెలిపారు. పాడి రైతులు పశువులకు గాలికుంటువ్యాధి నియంత్రణకు టీకాలు తప్పకుండా వేయించాలని సూచించారు. కొంతమంది పాలు తగ్గిపోతాయనే కారణంతో టీకాలు వేయించడం లేదన్నారు. టీకాలు వేయడం వల్ల పాలు తగ్గే అవకాశం ఉండదని తెలిపారు. మేకలు, గొర్రెలకు ప్రస్తుత సీజనులో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం 15 పాడిపశువులకు గర్భనిర్ధారణ టీకాలు వేశారు. 10 మేకలకు నట్టల నివారణకు మందులు పిచికారీ చేశారు.

కార్యకర్తకు నివాళి



సంజయ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త టి.సంజయ్ శుక్రవారం వరదయ్యపాళెం మండలంలోని ఓ ఆలయానికి సంబంధించి ఆర్చ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. ఈ విషయం తెలిసి మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి శనివారం మృతుడు సంజయ్ ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట స్థానిక నాయకులు చంద్రారెడ్డి, యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి గ్రామోత్సవం



మాడవీధుల్లో భక్తులను కటాక్షిస్తున్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి

వడమాలపేట: మండల పరిధిలోని అప్పలాయగుంటలో వెలిసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవను అర్చకులు భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు జరిపించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించారు. అర్చకులు వేదమంత్రాల పఠించగా, భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీవారికి ఊంజల్‌సేవ వేడుకగా నిర్వహించారు. అనంతరం సర్వఅలంకార భూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణలతో నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. భక్తుల నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు సర్వదర్శనానికి అనుమతించారు. రాత్రి స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈనుకార్యక్రమంలో ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాడ వీధుల్లో మెటల్ డిటెక్టర్లు





తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఆలయ పరిసరాల్లో అత్యంత భారీ భద్రత ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగా నాలుగు మాడ వీధుల్లో మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేశారు. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు భక్తులను తనిఖీలు చేస్తున్నారు. – తిరుమల

జూలై 8న స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర మహాసభలు

తిరుపతి కల్చరల్: విజయవాడలో జూలై 8వ తేదీన స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ తెలిపారు. బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం స్కూల్ స్వీపర్స్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలన్నారు. స్కూల్ స్వీపర్స్‌పై పనిభారం పెరుగుతున్నా రెగ్యులర్‌గా జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై ఈ నెల 19వ తేదీన చిత్తూరు జిల్లా కలెక్టర్‌ను, డీఈవోను కలిసి వినతి పత్రం సమర్పించాలని తీర్మానించినట్టు పేర్కొన్నారు.

గ్రామాల్లో 104 వాహన సేవలు



ఉచిత కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: ప్రస్తుత సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 104 వాహన వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం శ్రీకావేరిరాజుపురం ఆరోగ్య ఉపకేంద్ర ఆవరణలో ఏఎన్‌ఎం రేవతి ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందించారు. అలాగే పలువురికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు చిన్నచిన్న వ్యాధులకే పట్టణాల్లోని ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం 104 వాహనం ద్వారా వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 60 ఏళ్ల పైబడిన వారికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేసి, కంటిపొర తీయడం, కంటి అద్దాలు వంటివి కూడా ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం 25 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆప్తమాలిక్ అసిస్టెంట్ రమిళ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై శ్రద్ధ పెట్టండి



చెత్త సేకరణ కేంద్రంలో వానపాముల ఎరువును పరిశీలిస్తున్న అయ్యప్ప, రమేష్

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టా పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని మండల విస్తరణాధికారి రమేష్ తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలోని ఆముదాల, పాలసముద్రం చెత్త సేకరణ కేంద్రాన్ని సర్పంచ్ అయ్యప్పలో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరడంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించి, వానపాములు వదలాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకే కేజీల ప్రకారం విక్రయించాలని తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాని సూచించారు. కార్యక్రమంలో నరేష్, ధరణి, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

అద్వితీయం.. సహన నృత్యాభినయం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారి సహన

తిరుపతి కల్చరల్: మహతిలో శనివారం రాత్రి చిన్నారి ప్రిషిత సహన చేసిన భరత నాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన ఎస్పీడీసీఎల్ రిటైర్డ్ ఎస్‌ఈ సుబ్బన్న మనవరాలు అయిన ప్రిషిత సహన అమెరికాలో ఉంటూ భారతీయ కళలపై ఆసక్తితో భరత నాట్యం అభ్యసించింది. నృత్య ఆరంగేట్రాన్ని మహతి కళాక్షేత్రంలో చేపట్టింది. ఇందులో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమా ముద్దుబాల, మృదంగం విభాగాధిపతి ఎం.సుధాకర్, నృత్యాచార్యుడు పి.రవిసుబ్రమణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారి సహన చక్కటి హావభావాలు, ఆహార్యంతో, లయబద్ధంగా నృత్యం చేసి ప్రేక్షకుల మన్ననలు అందుకుంది. తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సీఆర్‌కే.శేషగిరిరావు, ప్రసాద్‌రావు, బుజ్జిబాబు, శాంతావాణి, వీకే.రెసిడెన్సీ అధినేత పి.సూర్యప్రకాష్ తదితరులు చిన్నారిని అభినందించి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో చిన్నారి సహన తల్లిదండ్రులు శైలజ, విజయకుమార్, గురువు గురు కళశ్రీ ఆషా గోపాల్, రిటైర్డ్ ఎస్‌ఈ సుబ్బన్న పాల్గొన్నారు.